# బీఆర్ఎస్‌తోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి

**సునీతా లక్ష్మారెడ్డికి ముస్లింలు మద్దతుగా నిలవాలి**





నర్సాపూర్ సమావేశంలో మాట్లాడుతున్న హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి, వేదికపై ముస్లిం మైనార్టీ నాయకులు

- **భారీ మెజార్టీతో గెలిపించాలి**
- **కాంగ్రెస్ పాలనలో హిందూ ముస్లింలకు తరుచూ గొడవలు**
- **సీఎం కేసీఆర్ పాలనలో అన్నదమ్ముల్లా..**
- **షాదీముబారక్ కింద రూ.2400 కోట్లు అందజేత**
- **కేసీఆర్ లాంటి నాయకుడు దేశంలో లేరు**
- **రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ**

నర్సాపూర్, నవంబర్4: బీఆర్ఎస్‌తోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి సాధ్యపడుతుందని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నర్సాపూర్ నియోజకవర్గ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ ప్రాణాన్ని ఫణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చారన్నారు. తెలంగాణ ఏర్పడ్డప్పటి నుంచి నేటి వరకు రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్ద పీట వేశారన్నారు. 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, రైతుబంధు, రైతుబీమా, షాదీముబారక్ తదితర పథకాలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అగ్రస్థానంలో సీఎం కేసీఆర్ నిలిపారన్నారు. 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో, తొమ్మిదేండ్ల టీడీపీ పాలనలో తెలంగాణ వెనకబడిపోయిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చాక రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతున్నదన్నారు. కాంగ్రెస్ పాలనలో హిందూ, ముస్లింలు తరుచూ గొడవలు పడేవారని, కాని నేడు అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉంటున్నారని పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ, వినాయక నిమజ్జనం ఒకే రోజు రావడంతో ముస్లిం మతపెద్దలు సామరస్యంతో ఆలోచించి పండుగను వాయిదా వేసుకున్నారన్నారు. రాష్ట్రంలో నెలకొన్న శాంతిభద్రతలకు ఇదే నిదర్శనమని వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఎలాంటి గొడవలు లేకుండా రాష్ట్రం శాంతియుతంగా ఉన్నదన్నారు. ముస్లిం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి సీఎం కేసీఆర్ ఎన్నో రెసిడెన్షియల్ పాఠశాలలు నెలకొల్పారన్నారు. పేద ముస్లిం విద్యార్థులు విదేశాల్లో చదువుకోడానికి రూ.20 లక్షల సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఇమామ్‌లను గౌరవించుకునేలా వారికి గౌరవ వేతనం కూడా ఇస్తున్నామన్నారు. షాదీముబారక్ పథకాన్ని తీసుకొచ్చి ముస్లిం ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ అండగా నిలిచారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నేటి వరకు రూ.2400 కోట్లు చెక్కుల రూపంలో అందజేశారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే ముస్లింలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని భరోసానిచ్చారు. కాంగ్రెస్ అధికారంలో ఉండగా ఏ ఒక్కరికీ మంత్రి పదవి ఇవ్వలేదని, కేసీఆర్ పాలనలో ముస్లిం మైనార్టీలకు సముచిత స్థానం దక్కిందని వెల్లడించారు. కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ భావాజాలాలు కలిగిన వ్యక్తి అని ఆరోపించారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపించుకుంటామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. సోదరి సమానురాలైన బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి ముస్లింల మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. సునీతాలక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ముస్లింలను కోరారు.

### 50 వేల మెజార్టీతో గెలుపిస్తాం: ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డిని 50 వేల మెజార్టీతో గెలిపిస్తామని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలోనే ముస్లింలకు ఎంతో మేలు జరిగిందన్నారు. హిందూ ముస్లింలు అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉంటున్నామంటే, దానికి కారణం సీఎం కేసీఆర్ అని అన్నారు. నర్సాపూర్‌లో ముస్లింల గ్రేవ్ యార్డ్ కోసం 5 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ముస్లింలు కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు.

## ముస్లిం మైనార్టీలకు పెద్ద పీట

**- నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి**

సీఎం కేసీఆర్ ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేశారని నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఒకే వేదికపైకి ముస్లింలు ఇంత పెద్ద సంఖ్యలో తరలిరావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ ముస్లిం విద్యార్థులకు రెసిడెన్షియల్స్ స్థాపించి, వారి విద్యకు అండగా నిలిచారన్నారు. ఈ సారి కూడా ముస్లింలు బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సహకారంతో పట్టణంలోని ముస్లింలకు గ్రేవ్ యార్డ్ కోసం 5 ఎకరాల స్థలాన్ని కేటాయించారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మైనార్టీ సెల్ సెక్రటరీ బాసిత్, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, వైస్ ఎంపీపీ వెంకట నర్సింగరావు, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు హబీబ్ ఖాన్, ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు రావూఫ్, ముస్లిం మత పెద్ద మసియోద్దీన్, బీఆర్ఎస్ నాయకులు షేక్‌హుస్సేన్, లియాకత్, ఫిరోజ్, అజీమొద్దీన్, అఫీజ్ ఖుత్బుద్దీన్, జేడీ మహమ్మద్, లాయక్ అలీఖాన్, హిబ్రహీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి ఓటు వేయాలని కోరుతున్న మంత్రి మహమూద్ అలీ



నర్సాపూర్‌లో సమావేశానికి హాజరైన ముస్లిం మైనార్టీలు



కోనాయిపల్లిలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులకు తిలకం దిద్దుతున్న మహిళలు



కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న సీఎం కేసీఆర్



ఆలయంలో కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి మూలవిరాట్

# మురిసిన కోనాయిపల్లి

## ముఖ్యమంత్రి రాకతో గ్రామంలో పండుగ వాతావరణం

- **కదిలివచ్చిన ఊరుఊరంతా**
- **సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు**
- **మంగళ హారతులు ఇచ్చి.. నుదిటిన తిలకం దిద్దిన మహిళలు**
- **గులాబీపూల వర్షం కురిపించిన బీఆర్ఎస్ శ్రేణులు**
- **జనసంద్రంగా మారిన ఆలయ పరిసరాలు**
- **దేశ్‌కీ నేత సీఎం కేసీఆర్ అంటూ పెద్దఎత్తున నినాదాలు**
- **హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ అంటూ ప్లకార్డుల ప్రదర్శన**
- **గ్రామస్తులకు అభివాదం చేసిన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు**

సిద్దిపేట అర్బన్ /నంగునూరు, నవంబర్ 4: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని కోనాయిపల్లి గ్రామం శనివారం సందడిగా మారింది. గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది. తనకు ఎంతో ఇష్టమైన, అచ్చొచ్చిన కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక పూజలు చేశారు. ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రం నుంచి రోడ్డు మార్గాన మధ్యాహ్నం 12.36 గంటలకు గ్రామానికి చేరుకున్న ముఖ్యమంత్రికి ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో తొలుత ధ్వజ స్తంభానికి మొక్కి గుడిచుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నామినేషన్ పత్రాలను స్వామి వారి సన్నిధిలో ఉంచి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు పూజలు నిర్వహించి నామినేషన్ పత్రాలతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. సీఎం కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డి శాసనసభకు వేసే (రెండు సెట్లు) నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. ఈనెల 9న గజ్వేల్, కామారెడ్డిలో సీఎం కేసీఆర్, సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు తమ నామినేషన్లు వేయనున్నారు. ఈ పూజా కార్యక్రమం మధ్యాహ్నం 1.15 గంటల వరకు కొనసాగింది. పూజల అనంతరం సీఎం కేసీఆర్ బయటకు వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. అంతకుముందే కోనాయిపల్లి గ్రామానికి మంత్రి హరీశ్‌రావు చేరుకొని ప్రజలకు, పార్టీ శ్రేణులకు అభివాదం చేశారు. అనంతరం హైదరాబాద్ తిరుగు పయనమయ్యారు.



కోనాయిపల్లిలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు



తెలంగాణ పాటల సీడీని ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు

### సందడిగా మారిన కోనాయిపల్లి...

సీఎం కేసీఆర్ రాకతో కోనాయిపల్లి సందడిగా మారింది. తమ అభిమాన నాయకుడిని చూసేందుకు ఊరి జనమంతా ఆలయం వద్దకు తరలివచ్చారు. యువకులు, మహిళలు, రైతులు, పండుటాకులు, చిన్నారులు అంతా ఉత్సాహంగా వచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజల వచ్చారు. మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తలు తరలివచ్చారు. దీంతో గ్రామంలో ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనిపించింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, జడ్పీటీసీ తడిసిన ఉమా వెంకట్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ వెంకటేశం, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు బాలకిషన్‌రావు, శ్రీనివాస్‌రావు, కడవెర్గు రాజనర్సు, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, సాయిరాం, జాపశ్రీకాంత్‌రెడ్డి, దువ్వల మల్లయ్య, వేముల వెంకట్‌రెడ్డి, ఎడ్ల సోంరెడ్డి, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, లింగంగౌడ్, కిష్టారెడ్డి, పురేందర్, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

### తిలకం దిద్దిన మహిళలు

తమ గ్రామానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను చూసి కోనాయిపల్లి మహిళలు మురిసిపోయారు. వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన కేసీఆర్‌కు గ్రామస్తులు, మహిళలు, పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. సీఎం కేసీఆర్‌కు తిలకం దిద్దారు. పూజల కార్యక్రమం అనంతరం సీఎం కేసీఆర్ మహిళల వద్దకు వచ్చి వారికి అభివాదం చేయడంతో వారంతా సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణుల వద్దకు వచ్చి అభివాదం చేసి యోగ క్షేమాలు అడిగి తెలుసుకోవడంతో ఆనందానికి గురయ్యారు. పార్టీ శ్రేణులు పోటీపడి సీఎం కేసీఆర్‌తో కరచలనం చేయగా.. వారందరికీ సీఎం షేక్‌హ్యాండ్ ఇచ్చారు. దేశ్‌కీ నేత సీఎం కేసీఆర్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ పాటల పందిరి సీడీని సీఎం కేసీఆర్ ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులు, గ్రామస్తులు సీఎం కేసీఆర్‌పై గులాబీలతో పూల వర్షం కురిపించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు ఆలయం వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు



అభిమాన నేతను చూసేందుకు ఓ ఇంటి డాబాపైకి ఎక్కిన గ్రామస్తులు



సీఎం కేసీఆర్‌ను చూస్తూ కేరింతలు కొడుతున్న యువకులు, కార్యకర్తలు